PRGI NO: TGTEL/26/A0383

# డైనమిక్ జనం వాయిస్

తెలుగు దినపత్రిక

DYNAMIC JANAMVOICE

WWW.JANAMVOICE.COM

తెలంగాణ ఆదివారం 04-10-2026 సంపుటి: 01 సంచిక : 266 పేజీలు : 12

# హనుమాన్ చాలీసా చదువుతూనే పోరాడా!

గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు ప్రధాని మోదీ ఫోన్. కాక్‌పిట్‌లో జరిగిన ఘటనను ప్రధానికి వివరించిన పైలట్.

జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 3:

దుబాయ్ విమానంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రయాణికుల రక్షణ కోసం ధైర్యంగా పోరాడి గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో పరామర్శించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్‌తో వీడియో కాల్ ద్వారా మాట్లాడిన ప్రధాని.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాక్‌పిట్‌లో ఎదురైన పరిస్థితులను మచ్చర్ ప్రధానికి వివరించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మచ్చర్ ధైర్యాన్ని ప్రధాని మోదీ అభినందించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రయాణికుల రక్షణకు కృషి చేసిన తీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మచ్చర్ త్వరగా కోలుకోవాలని యావత్ దేశం ప్రార్థిస్తోందని తెలిపారు. ప్రధాని నుంచి నేరుగా ఫోన్ రావడంతో కెప్టెన్ స్మిత్ మచ్చర్ భావోద్వేగానికి గురయ్యారు. మోదీతో మాట్లాడుతూ.. ఆయన తనకు ఎంతో ఆరాధనీయుడని, ప్రధాని నుంచి ఫోన్ వస్తుందని తాను కలలో కూడా ఊహించలేదని అన్నారు. - మిగతా 2 లో...



## ఆర్టీసీ మెట్రో కామన్ పాస్ అమలు

ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ ప్రయాణం.
బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ వరకు మంత్రుల ప్రయాణం.
లాస్ట్ మైల్ కనెక్టివిటీపై ప్రభుత్వ దృష్టి.
భవిష్యత్‌లో ఆటోలు, ఉబర్ సేవల అనుసంధానం.



## ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

త్రిముఖ పోరులో కొత్త రాజకీయ సమీకరణాలకు తెర..!
కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు సవాల్‌గా తెలంగాణ రక్షణ సేన.
మహిళా ఓటర్లు.. సామాజిక తెలంగాణ నినాదంపైనే కవిత వ్యూహం.
దానం నాగేందర్ వ్యవహారమే ప్రధాన ప్రచారాస్త్రం..!



## జేఎన్టీయూలో రీసెర్చ్ ఎడ్యుకేషన్ అడ్వాన్స్‌మెంట్ కాంక్లేవ్

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.
విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి.
అకాడమిక్స్, ఇండస్ట్రీ మధ్య అంతరాన్ని తగ్గించాలి.
విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి.
వర్సిటీల్లో ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యత.



## పిల్లల రక్షణకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత

ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల నుంచి రక్షణ.
భరోసా కేంద్రాలతో సమగ్ర సేవలు.
విద్యార్థులను సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దుతున్నాం.
తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి.



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.



చివరి నిమిషంలో కీలక నిర్ణయం!
తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి.
పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి



మల్లికార్జున ఖర్గే.
దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే.
మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య.
ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ.



## కెప్టెన్ స్మిత్ ఆరోగ్యంపై గుడ్‌న్యూస్.. చికిత్సకు బాగా స్పందిస్తున్న పైలట్

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు

నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు.
రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు.
ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా.



## తెలంగాణలో దసరా సెలవులు ఖరారు.

పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు.
పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22 వరకు మొత్తం 13 రోజుల సెలవులు.
జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 10 నుంచి 21 వరకు 12 రోజుల పాటు సెలవులు.
అక్టోబర్ 23న స్కూళ్లు, 22న కాలేజీలు తిరిగి పునఃప్రారంభం.
సెలవులకు ముందు రోజే ముగియనున్న సమ్మేటివ్-1 పరీక్షలు.

## గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

- భూసేకరణ, పునరావాస సమస్యలను త్వరగా పరిష్కరించాలి.
- కాలువల పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు.
- పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి.
- మిగిలిన పనులకు త్వరలో టెండర్ల ప్రక్రియ.



జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 3:

గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పురోగతిపై సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులు, సవరించిన అంచనాలు, కాలువల పనులు, నీటి నిల్వలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. 2007లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2013 నాటికి సుమారు 57 శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం భూసేకరణ తదితర అంశాల్లో చోటుచేసుకున్న జాప్యంతో ప్రాజెక్టు పనులు మందగించాయి. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించడంతో గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు మంత్రులకు వివరించారు. మిగిలిన భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని మంత్రులు ఆదేశించారు. గౌరవెల్లి - మిగతా 2 లో...

దైనమిక్ జనం వాయిస్
RNI NO:TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# హనుమాన్ చాలీసా చదువుతూనే పోరాడా!

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబరు 3:**

దుబాయ్ విమానంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రయాణికుల రక్షణ కోసం ధైర్యంగా పోరాడి గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో పరామర్శించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్‌తో వీడియో కాల్ ద్వారా మాట్లాడిన ప్రధాని.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాక్‌పిట్‌లో ఎదురైన పరిస్థితులను మచ్చర్ ప్రధానికి వివరించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మచ్చర్ ధైర్యాన్ని ప్రధాని మోదీ అభినందించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రయాణికుల రక్షణకు కృషి చేసిన తీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మచ్చర్ త్వరగా కోలుకోవాలని యావత్ దేశం ప్రార్థిస్తోందని తెలిపారు. ప్రధాని నుంచి నేరుగా ఫోన్ రావడంతో కెప్టెన్ స్మిత్ మచ్చర్ భావోద్వేగానికి గురయ్యారు. మోదీతో మాట్లాడుతూ.. ఆయన తనకు ఎంతో ఆరాధనీయుడని, ప్రధాని నుంచి ఫోన్ వస్తుందని తాను కలలో కూడా ఊహించలేదని అన్నారు.



### కష్ట సమయంలో హనుమాన్ చాలీసా

తనకు అనుకోని, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు హనుమాన్ చాలీసా పఠించడం అలవాటని మచ్చర్ తెలిపారు. విమాన కాక్‌పిట్‌లో ఘర్షణ చోటుచేసుకున్న సమయంలోనూ తాను హనుమాన్ చాలీసా పఠించానని చెప్పారు. ఆ సమయంలో తాను గాయపడినప్పటికీ తన ప్రాణాల గురించి ఆలోచించలేదని, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకూడదని దేవుడిని ప్రార్థించానని వివరించారు. తాను ఎలాగైనా లేచి నిలబడాలని గట్టిగా నిర్ణయించుకున్నానని, తాను కదలలేని పరిస్థితి ఏర్పడితే తనతో పాటు విమానంలోని ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని భావించానని మచ్చర్ ప్రధానికి తెలిపారు. ఆ సమయంలో తనకు వచ్చిన ఆలోచన ఒక్కటేనని.. ప్రయాణికులను ఎలాగైనా కాపాడాలనే సంకల్పంతో ముందుకు వెళ్లానని వివరించారు.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు.

**జనం వాయిస్, తెలంగాణ, అక్టోబర్ 03:**



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

**జనం వాయిస్ హైదరాబాద్, అక్టోబరు 3:**

ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో వేడి పెంచుతోంది. దానం నాగేందర్ వ్యవహారంతో అనివార్యమైన ఉపఎన్నికలో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలకు పదును పెడుతుండగా.. ఇప్పుడు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా తమ పార్టీ అభ్యర్థిని బరిలోకి దింపుతామని ప్రకటించడంతో పోరు మరింత ఆసక్తికరంగా మారింది.

### కొత్త పార్టీకి తొలి పరీక్ష

తెలంగాణ రక్షణ సేనకు ఖైరతాబాద్ ఉపఎన్నిక తొలి ప్రధాన ఎన్నిక కావడంతో ఈ పోరు ఆ పార్టీ రాజకీయ ఉనికికి కీలకంగా మారింది. కేవలం గెలుపు లక్ష్యంతో కాకుండా.. హైదరాబాద్ నగరంలో తమకు ఉన్న రాజకీయ ఆదరణను అంచనా వేసుకునేందుకు ఈ ఎన్నికను వేదికగా మలుచుకునే అవకాశం కనిపిస్తోంది. పార్టీ ఆవిర్భావం తర్వాత కవిత ప్రకటించిన తొలి కీలక ఎన్నికల పోటీలో ఖైరతాబాద్ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.



### మహిళా ఓటర్లే కీలక బలం

ఖైరతాబాద్‌లో విభిన్న వర్గాల ఓటర్లు ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ, మహిళా సాధికారత అంశాలపై గతంలో కవిత చేసిన కార్యక్రమాలను ప్రచారంలోకి తీసుకురావడంతో పాటు.. ధరల పెరుగుదల, మహిళా భద్రత, ప్రజా సమస్యలను ప్రధాన అస్త్రాలుగా మలుచుకునే అవకాశం ఉంది. ఈ అంశాలపై కవిత ప్రచారం ఏ మేరకు ప్రభావం చూపుతుందనేది ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారనుంది.

### దానం నాగేందర్ అంశంపై పదునైన దాడి

ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్ ఉపఎన్నికకు తెరలేచింది. ఈ వ్యవహారాన్ని కవిత తన రాజకీయ ప్రచారంలో ప్రధాన అంశంగా ప్రస్తావిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులు, ప్రజా తీర్పు, ప్రజాస్వామ్య విలువల అంశాలను ముందుకు తెచ్చి కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్‌పై కూడా విమర్శలు గుప్పించే వ్యూహంతో ఆమె ముందుకు సాగుతున్నట్లు తాజా రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి.

### ఓట్ల శాతంపైనే అసలు లెక్కలు!

ఖైరతాబాద్‌లో తెలంగాణ రక్షణ సేనకు లభించే ఓట్ల శాతం ఆ పార్టీ భవిష్యత్ రాజకీయ ప్రస్థానంపై చర్చకు దారితీయనుంది. ప్రధాన పార్టీల మధ్య పోటీ నేపథ్యంలో కొత్త పార్టీ ఎంత మేరకు ఓటర్లను ఆకర్షిస్తుందన్నదే రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు నియోజకవర్గంపై దృష్టి సారించిన వేళ.. కవిత పార్టీ ప్రవేశంతో ఎన్నికల సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారాయి.

# ఆర్టీసీ మెట్రో కామన్ పాస్ అమలు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 03:**

హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై ఒకే కామన్ పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించారు. ఈ సేవలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, అధికారులు స్వయంగా ప్రయాణించి పరిశీలించారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మంత్రులు మెట్రోలో ప్రయాణించారు. అనంతరం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి కామన్ పాస్ విధానాన్ని ప్రత్యక్షంగా పరీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌తో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. మెట్రో, ఆర్టీసీ సేవల సమన్వయంతో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుతుందని చెప్పారు. మెట్రో దిగిన తర్వాత బస్సు కోసం ప్రయాణికులు అయోమయానికి గురికాకుండా ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. మెట్రో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను కీలకమైన లాస్ట్ మైల్ కనెక్టివిటీగా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సులభమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్‌లో మెట్రో--ఆర్టీసీ సేవల అనుసంధానాన్ని మరింత విస్తరించడంతో పాటు ఆటోలు, ఉబర్ వంటి రవాణా సేవలను కూడా అనుసంధానించే ఆలోచన ఉందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజా రవాణా వ్యవస్థను సమగ్రంగా అనుసంధానించి ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

# లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

**జనం వాయిస్, తెలంగాణ, అక్టోబర్ 03:**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# పిల్లల రక్షణకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 3:**

మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా అవసరమైన భద్రత, సంరక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పిల్లల రక్షణ కోసం న్యాయ సేవల ప్రాధికార సంస్థ (౧+హూూూ) చేపడుతున్న కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని వెల్లడించారు. హైదరాబాద్‌లో జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (చీూూూూ) ఆధ్వర్యంలో లిలి"డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం"లిలి అనే అంశంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, వివిధ రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### భరోసా కేంద్రాలతో సమగ్ర సేవలు

మహిళలు, పిల్లలకు పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్‌ను ఒకే చోట అందించేందుకు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లో దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో ౫౧౧జు-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని వివరించారు.

### విద్యార్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన

CybHER యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులను సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్ది, తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 3 వేల మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.

### తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులు కూడా ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సీఎం సూచించారు. పిల్లలను తప్పుబట్టకుండా వారికి అండగా నిలిచి, అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1930 చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

### దేశానికి మార్గదర్శకంగా సదస్సు

పిల్లల రక్షణ కోసం అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సదస్సులో జరిగే చర్చలు, సూచనలు, సిఫారసులు దేశవ్యాప్తంగా పిల్లల భద్రతకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కెప్టెన్ స్మిత్ ఆరోగ్యంపై గుడ్‌న్యూస్.. చికిత్సకు బాగా స్పందిస్తున్న పైలట్

**జనం వాయిస్, తెలంగాణ, అక్టోబర్ 03:**

ఫ్లైదుబాయ్ విమానంలో ప్రయాణికుల ప్రాణాలు కాపాడేందుకు సాహసం చేసిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వేగంగా కోలుకుంటున్నారు. చికిత్సకు ఆయన బాగా స్పందిస్తున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం శనివారం తెలిపింది. స్మిత్‌కు ప్రస్తుతం మెరుగైన వైద్యం అందుతోంది. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు జరుపుతోంది. స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఆయనకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్న యూఏఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో బుధవారం మరో పైలట్ స్మిత్‌పై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో విమానం ఒక్కసారిగా కిందకు దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడినప్పటికీ స్మిత్ ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్మిత్‌కు ప్రాథమిక చికిత్స అందిస్తూ విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా దించారు. స్మిత్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన ధైర్యం, సమయస్ఫూర్తిని ప్రశంసించారు. స్మిత్ సాహసం ఎంతోమంది ప్రాణాలను కాపాడిందని చెప్పారు. దేశమంతా ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తోందని తెలిపారు. స్మిత్ సాహసాన్ని ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రశంసిస్తున్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.17 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మంత్రులు సూచించారు. వివాహిత కుమార్తెలకు పునరావాస ప్రయోజనాలు, పాత, కొత్త ముంపు ప్రాంతాల్లోని కుటుంబాలకు సంబంధించిన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. గౌరవెల్లి కాలువలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కూడా సమీక్షించారు. ఇప్పటికే నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. మిగిలిన భూసేకరణను పూర్తి చేసి కాలువల పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రులు ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పర్యావరణ అనుమతులపైనా సమావేశంలో చర్చించారు. కేంద్ర సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. భూసేకరణ, పునరావాసం, ధరల పెరుగుదల తదితర కారణాలతో రిజర్వాయర్, కాలువలకు సంబంధించిన సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. మిగిలిన పనులకు పరిపాలనా అనుమతులు లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎంఎంఆర్ ప్యాకేజీ-3 పనుల సవరించిన అంచనాలు, అదనపు నిర్మాణాల ప్రతిపాదనలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా మంత్రులు సమీక్షించారు. అవసరమైన పర్యావరణ, ఇతర ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే గౌరవెల్లి రిజర్వాయర్ పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ, పునరావాసం, అనుమతులకు సంబంధించిన అన్ని పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణ-పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు, ఈఎన్‌సీ ఓ అండ్ ఎం మధుసూదన్ రావు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్‌తో పాటు మూడు జిల్లాలకు చెందిన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది: హరీశ్ రావు

**జనం వాయిస్, మెదక్, అక్టోబర్ 03:**



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

# తెలంగాణలో దసరా సెలవులు ఖరారు.

**జనం వాయిస్, తెలంగాణ, అక్టోబర్ 03:**



తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ూూ-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

# జేఎన్టీయూలో రీసెర్చ్ ఎడ్యుకేషన్ అడ్వాన్స్మెంట్ కాంక్లేవ్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 3:**

జేఎన్టీయూ హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో రీసెర్చ్ ఎడ్యుకేషన్ అడ్వాన్స్మెంట్ కాంక్లేవ్ నిర్వహించారు. ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సైయంట్ సంస్థ చైర్మన్ బీవీ మోహన్ రెడ్డి, జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్య అనేది కేవలం పాఠ్యాంశాలను నేర్చుకోవడం మాత్రమే కాదని, వాస్తవ ప్రపంచంలోని సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే ప్రక్రియ అని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు డిగ్రీతో పాటు స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌లను అందిస్తూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. అకాడమిక్స్‌కు, ఇండస్ట్రీకి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకంగా ఉపయోగపడతాయని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే రెండు లక్షల ఉద్యోగాలు కల్పించామని, రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేని యువతకు ప్రైవేట్ రంగంలో అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో సిఎస్ఆర్ నిధులతో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని ఐటీ, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులకు మంత్రి సూచించారు. దీనివల్ల విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అనంతరం హైదరాబాద్ ఎ హబ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించి పంపిణీ చేశారు. విద్యా రంగంలో మార్పులు తీసుకురావడంతో పాటు విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కాంక్లేవ్‌లు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM
RNI NO:TGTEL/26/A0383

## రామగిరి ఖిల్లాపై అనుమానాస్పద కార్యకలాపాలపై

# తక్షణ విచారణ జరపాలి

- చర్యలు తీసుకోకపోతే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్తాం.
- మాజీ బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్.

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 3:**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండల పరిధిలోని చారిత్రక రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్నట్లు చెబుతున్న పలు పరిణామాలపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఖిల్లా ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు జెండాలు ఏర్పాటు చేయడం, పూజా కార్యక్రమాలు



నిర్వహించడం, జంతుబలి ఇచ్చినట్లు, కొన్ని ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం వెలువడుతోందని ఆయన పేర్కొన్నారు.

### అనుమతులు ఎవరిచ్చారు.. అసలు ఉద్దేశం ఏమిటి?

చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఇలాంటి కార్యకలాపాలు ఎవరి అనుమతితో నిర్వహించారో అధికారులు స్పష్టం చేయాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమాలను ఎవరు నిర్వహించారు? వాటి వెనుక ఉద్దేశం ఏమిటి? తవ్వకాలు ఎందుకు చేపట్టారు? అనే అంశాలపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

### చారిత్రక వారసత్వ సంపదను కాపాడాలి

రామగిరి ఖిల్లా ప్రాంతం చారిత్రక వారసత్వ సంపద అని, దాని పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అనుమతులు లేకుండా చారిత్రక ప్రదేశాల్లో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### చర్యలు లేకుంటే బండి సంజయ్ దృష్టికి..

రామగిరి ఖిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికారులు వెంటనే స్పందించకపోతే, ఖిల్లా పరిరక్షణతో పాటు ఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని మొలుమూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో సెంటనరకాలనీ అధ్యక్షుడు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబరు 3:**

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. సతీష్ కుమార్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా శనివారం పెద్దపల్లి డీఎఫ్ఓ ఆదేశాల మేరకు పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్, మంథని రేంజ్ అటవీశాఖ సిబ్బంది పెద్దపల్లి పోలీసులతో కలిసి కుర్మపల్లి గ్రామంలో కార్డన్ సెర్చ్, రైడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల వేటకు ఉపయోగించే వలలు, క్లచ్ వైర్లు, జాలీలు, ఉచ్చులు, కత్తులు, ఇనుప కేజులు, నైలాన్ తాళ్లు, బైండింగ్ వైర్లు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో వన్యప్రాణుల వారోత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ టి. సతీష్ కుమార్ మాట్లాడుతూ అడవులను నరికివేయడం, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఎవరైనా అక్రమంగా అడవుల్లో వన్యప్రాణులను వేటాడితే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని




హెచ్చరించారు.

### దేవాలయ ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం

అనంతరం బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో అటవీశాఖ సిబ్బంది శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ టి. సతీష్ కుమార్‌తో పాటు మంథని అటవీ క్షేత్ర అధికారి ఎం. వినయ్ నాయక్, డిప్యూటీ



రేంజ్ అధికారులు పి. దేవదాస్, ఎన్. రమేష్, జే. తిరుపతి, సెక్షన్ అధికారులు జి. కొమురయ్య, ఎస్.డి. రహమతుల్లా, ఎం. నరసయ్య, హెచ్. మంగీలాల్, ఎండి. అమిరుద్దీన్, రవి, ముదస్సర్ షా తదితరులు, బీట్ అధికారులు జి. రామ్మూర్తి, ఎస్. మెగరాజ్, పవన్, ప్రదీప్, తిరుపతి, మాధురి, రంజిత్, శ్రీకాంత్, అక్తర్ పాషా, రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రూ.1.15 కోట్లతో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో చైతన్య జ్యోతి పెట్రోల్ పంపు.
- పెద్దపల్లి నియోజకవర్గంలో 15,715 సంఘాలకు రూ.33.42 కోట్ల రుణాలు.
- వడ్డీలేని రుణాల పరిమితి రూ.10 లక్షలకు పెంపు.
- మహిళల ఆర్థికాభివృద్ధికి ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్లు, చిరు వ్యాపారాల్లో అవకాశాలు.

**జనం వాయిస్, సుల్తానాబాద్, అక్టోబర్ 3:**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వావలంబన దిశగా తీసుకెళ్లడంతో పాటు వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో రూ. 1.15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన చైతన్య జ్యోతి పెట్రోల్ పంపును శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ మహిళలు కేవలం స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకే పరిమితం కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడంతో పాటు చిన్న దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, స్కూల్ యూనిఫామ్‌ల కుట్టు కేంద్రాలు వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఇప్పటికే 7 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. మహిళలు రైస్ మిల్లులు ఏర్పాటు చేసుకునేలా కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా మరిన్ని ఉపాధి, వ్యాపార అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.

### రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని విజయరమణారావు తెలిపారు. గతంలో రూ. 5 లక్షలుగా ఉన్న వడ్డీలేని రుణాల పరిమితిని రూ. 10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,715 స్వశక్తి సంఘాలకు రూ. 33.42 కోట్ల మేర రుణాలు అందించినట్లు వివరించారు. మహిళా స్వశక్తి సంఘాల సభ్యులకు బీమా భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. సహజ మరణం సంభవించిన మహిళలకు



రూ. 2 లక్షల రుణ బీమా, ప్రమాదవశాత్తు మరణించిన మహిళలకు రూ. 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 99 మంది మహిళలు సహజ మరణం చెందగా వారి కుటుంబాలకు రూ. 75 లక్షల మేర రుణ బీమా ప్రయోజనం అందించామని, ఆరుగురు మహిళలు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబాలకు రూ. 60 లక్షల ప్రమాద బీమా అందించినట్లు తెలిపారు.

### ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

×ఖూ కేంద్రాలను స్వశక్తి సంఘాల మహిళలు నిర్వహిస్తున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని విజయరమణారావు సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ×ఖూ కేంద్రాల నిర్వహణలో ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించాలని అధికారులను కోరారు.

### యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత యాసంగిలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని విజయరమణారావు సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసుకోవాలని కోరారు. వచ్చే ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిస్తే వరి సాగుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. స్వశక్తి సంఘాల మహిళలకు రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రమాదాల్లో మరణించిన ఆరుగురు స్వశక్తి సంఘాల సభ్యుల





కుటుంబాలకు రూ. 60 లక్షల బీమా అందించినట్లు చెప్పారు. సహజ మరణం సంభవించిన మహిళలకు రూ. 2 లక్షల రుణ బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. మహిళలకు విహబ్, పెట్రోల్ పంపులు తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మంథనిలో టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వడ్డీలేని రుణాల విధానాన్ని తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు. స్వశక్తి సంఘాల మహిళలకు సుమారు రూ. 33 కోట్ల మేర వడ్డీ రాయితీ ప్రయోజనం అందించినట్లు తెలిపారు.

### TASK ద్వారా 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు

మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ×ూూఖ ద్వారా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో సుమారు 3,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించగా, వారిలో సుమారు 60 శాతం మంది మహిళలేనని చెప్పారు. డిగ్రీ, పీజీ చదివిన మహిళలను గుర్తించి వారికి రుణాలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగం చేయలేని మహిళలకు జిల్లాలోనే వర్క్‌ఫ్రమ్‌హోమ్ అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

### ఒంటరి మహిళలకు ఆయిల్‌పామ్ సాగులో ప్రోత్సాహం

ఒంటరి మహిళలను ప్రత్యేకంగా గుర్తించి ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తోందని, మిగిలిన 10 శాతం వాటాను కూడా జిల్లా యంత్రాంగం భరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కొత్త ఉపాధి మార్గాలను సూచిస్తే వాటిని ప్రోత్సహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ అన్నయ్య గౌడ్, డీఆర్‌డీఓ కలిందిని, అదనపు డీఆర్‌డీఓ రవీందర్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి.

మూడు ముక్కలాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్..
రూ.28,120 నగదు స్వాధీనం.




**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబరు 3:**

పెద్దపల్లి పట్టణంలోని భూమ్‌నగర్ ప్రాంతంలో డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా మూడు ముక్కలాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్, పెద్దపల్లి టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అక్టోబరు 2న భూమ్‌నగర్‌లో పేకాట జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్ఐ దీకొండ రమేష్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పెద్దపల్లి టౌన్ పోలీసులు కలిసి దాడి చేపట్టారు. ఈ సందర్భంగా మూడు ముక్కలాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 52 ప్లేయింగ్ కార్డులు, రూ. 28,120 నగదు, 7 మొబైల్ ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఆరుగురు వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్టీఐపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

రామగుండం మున్సిపల్ అధికారుల తీరుపై సమాచార హక్కు కమిషన్ ఆగ్రహం.
15 రోజుల్లో సమాచారం ఇవ్వాలని ఆదేశం..
లేకపోతే షోకాజ్ నోటీసులు, జరిమానాలు తప్పవని హెచ్చరిక.
ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్.

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 3:**




సమాచార హక్కు చట్టాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ హెచ్చరించింది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం కింద కోరినప్పటికీ నిర్ణీత సమయంలో అందించకపోవడంపై కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు. తాను దాఖలు చేసిన ఆర్టీఐ ఫిర్యాదు, అప్పీల్‌పై శనివారం తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ విచారణకు మద్దెల దినేష్ హాజరై తన వాదనలు వినిపించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా అందించకపోవడంతో పాటు, మొదటి అప్పీల్ దశలోనూ స్పందన లేకపోవడాన్ని కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు సమాచార హక్కు చట్టం కల్పించిన హక్కు అని, చట్ట ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని అందించడం సంబంధిత అధికారుల బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసినట్లు దినేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు అధికారులు ఆర్టీఐ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించినట్లు తెలిపారు. కోరిన సమాచారాన్ని మరో 15 రోజుల్లోగా ఫిర్యాదుదారుడికి అందించాలని కమిషన్ గడువు విధించినట్లు దినేష్ తెలిపారు. ఆ గడువులోగా సమాచారం అందించకపోతే సంబంధిత పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, చట్ట ప్రకారం జరిమానా విధించే చర్యలు చేపడతామని కమిషన్ హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు

## రబీలో తక్కువ నీటి వినియోగ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

**జనం వాయిస్, కమాన్‌పూర్, అక్టోబర్ 3:**

రానున్న రబీ సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి సాగును తగ్గించి ఆయిల్‌పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. కమాన్‌పూర్ మండలంలో శుక్రవారం ఆయిల్‌పామ్ తోటలను సందర్శించిన జిల్లా ఉద్యానవన అధికారి రైతులతో మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, రానున్న రబీ సీజన్‌లో పంటల ఎంపిక తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి కోతల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రబీలో వరి సాగు చేపట్టే ముందు నీటి లభ్యతను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని శ్యామ్ ప్రసాద్ సూచించారు. భవిష్యత్ వర్షపాతంపై మాత్రమే ఆధారపడి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. రబీ సీజన్‌లో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండటంతో సాగునీటి సరఫరాపై పరిమితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దీంతో బోర్లు, బావుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున ముందుగానే పంటల ప్రణాళిక చేసుకోవాలని రైతులకు సూచించారు.

### సూక్ష్మ నీటిపారుదలతో నీటి పొదుపు

ఆయిల్‌పామ్, ఇతర ఉద్యాన పంటలను డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి తెలిపారు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటి లభ్యతకు అనుగుణంగా శాస్త్రీయంగా పంటలను ఎంపిక చేసుకుంటే సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పంటల సాగులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ జ్యోతి, ఏఈఓ నవీన్, ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.



RNI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమ మట్టి తవ్వకాలు?

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పుట్ట ముకేష్ ఫిర్యాదు



**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 3:**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ఆదివారంపేట గ్రామ సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, చెట్ల నరికివేత జరుగుతున్నాయని ఆరోపిస్తూ మంథనికి చెందిన పుట్ట ముకేష్ తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేసినట్లు శనివారం వెల్లడించారు. ఆదివారంపేట రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో మెఘా ఇంజనీరింగ్ సంస్థకు సంబంధించిన పనుల్లో అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు చేపట్టి, చెట్లను తొలగించి మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే సింగరేణి ఓసీ-2, ఓసీ-3 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌బర్డెన్ (ఓబీ) మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ, పెద్దపల్లి అధికారుల సహకారం ఉందన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.

**గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో నాసిరకం మట్టి వినియోగం?**

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో సింగరేణి బ్లాస్టింగ్ ద్వారా తొలగించిన, బొగ్గు కలిసిన నాసిరకం మట్టి (గ్రావెల్)ను రోడ్డు నిర్మాణం, స్ట్రెంతెనింగ్ పనులకు వినియోగిస్తున్నారని పుట్ట ముకేష్ ఆరోపించినట్లు తెలిపారు. రోడ్డు పనుల నాణ్యత, ఉపయోగిస్తున్న మట్టి నాణ్యత, సంబంధిత అనుమతులపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రతి రెండు కిలోమీటర్ల పరిధికి ఒక సబ్‌కాంట్రాక్టర్‌ను నియమించి, అనుభవం లేని వ్యక్తులతో పనులు చేయిస్తున్నారని, తద్వారా నాణ్యతా ప్రమాణాలు, టెండర్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించినట్లు తెలిపారు.

**అధికారుల పాత్రపైనా విచారణ కోరుతూ..**

మట్టి తవ్వకాలు, తరలింపు, చెట్ల తొలగింపు వ్యవహారంలో ఇంజనీరింగ్, మైనింగ్, అటవీ శాఖలకు చెందిన అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని విజిలెన్స్ విభాగాన్ని కోరినట్లు పుట్ట ముకేష్ తెలిపారు. అక్రమంగా తరలించిన మట్టి, తొలగించిన చెట్లకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత సంస్థలు, అధికారులు, కాంట్రాక్టర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు వెల్లడించారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సోషల్ మీడియా ఇంచార్జీగా కొమురోజు సురేష్

## నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షుడు పంద్రాల రాజు

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 3:**



సమాచార హక్కు చట్టం సాధన కమిటీ పెద్దపల్లి జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీగా మంథని పట్టణానికి చెందిన కొమురోజు సురేష్ నియమితులయ్యారు. కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆదేశాల మేరకు సురేష్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పంద్రాల రాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మంథని పట్టణంలో కొమురోజు సురేష్‌కు జిల్లా అధ్యక్షుడు పంద్రాల రాజు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు పంద్రాల రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రతి సామాన్య పౌరుడి హక్కు అని సురేష్ అన్నారు. ఈ చట్టాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన వివిధ సమస్యలు, ప్రభుత్వ పరమైన సమాచారం, ప్రజలకు అవసరమైన వివరాలను పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువస్తే కమిటీ తరఫున సంబంధిత అధికారులకు లేఖలు అందజేసి, సమస్యల పరిష్కారం కోసం చట్టపరమైన మార్గాల్లో కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా అధ్యక్షుడు పంద్రాల రాజు ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని సురేష్ తెలిపారు. ప్రజలు తమకు ఉన్న హక్కులను తెలుసుకుని వాటిని సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే కమిటీ ప్రధాన లక్ష్యమన్నారు. అక్టోబర్ 7న సమాచార హక్కు చట్టం--2005 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యులు, పరిచయస్తులు, దాతలు, సంస్థలు కార్యక్రమానికి సహకరించేందుకు ముందుకు రావాలని సురేష్ కోరారు. కార్యక్రమం గురించి తమకు పరిచయం ఉన్న వారికి తెలియజేసి, తమకు సాధ్యమైన మేరకు సహాయ సహకారాలు అందించేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

# పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా అందె రవి

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 3:**



గుంజపడుగు గ్రామ పద్మశాలి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా అందె రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక పద్మశాలి సంఘ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పెద్దపల్లి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అందె సదానందం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా అందె రవి, ఉపాధ్యక్షుడిగా బండి ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా ఆవిడపు రాజేశం, కోశాధికారిగా దుస్స శేఖర్, సంయుక్త కార్యదర్శిగా మాటేటి సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా బరిబద్దుల రాకేష్, గౌరవ అధ్యక్షుడిగా బరిబద్దుల రమేష్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా బండి రాయమల్లు, పినగాని రాజేశం, బండి రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా వంగ ఓదెలు, బరిబద్దుల రమేష్, దుస్స సునీల్, ఆవిడపు సంపత్, చౌటపెల్లి నటరాజ్, పినగాని రవికుమార్, గాదె రమేష్, దుస్స అశోక్, కొండి సాగర్, బరిబద్దుల రాజారాం, బండి మల్లేష్, అందె తిరుపతి, బరిబద్దుల అఖిల్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల పోచం, నల్ల శ్రీనివాస్, బరిబద్దుల వైకుంఠం, ఆవిడపు గట్టయ్య, రాపెల్లి శంకరయ్య, బండి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా డాక్టర్ దివ్యమూర్తికి అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారం

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 3:**




ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తికి అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారం లభించింది. హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపసభాపతి, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోత్ రామచంద్రనాయక్ చేతుల మీదుగా దివ్యమూర్తి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దివ్యమూర్తి ప్రతిభను గుర్తించిన ఇన్‌పాక్ట్ ఫౌండేషన్ సంస్థ ఈ పురస్కారాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసభాపతి జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి వంటి మేధావులు, ప్రతిభావంతులు రాష్ట్రానికి ఎంతో అవసరమని అన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభను చాటుతూ ముందుకు సాగుతున్న వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న అనంతరం డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి మాట్లాడుతూ తనకు ఈ గౌరవం దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు తన ప్రతిభకు గుర్తింపుగా 85 పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. తనను గుర్తించి అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారంతో సత్కరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో అందేకర్ శ్రీనివాస్, డాక్టర్ వంశీకృష్ణ, దివ్యమూర్తి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల బాధ్యతను గుర్తుచేసిన 'తిరగబడ్డ మమకారం'

- లఘుచిత్రాన్ని ఆవిష్కరించిన డీసీపీ రామ్‌రెడ్డి, ఏసీపీ రమేష్.
- చిత్ర బృందానికి అభినందనలు.

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 3:**



తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులను అనుభవిస్తూ, వృద్ధాప్యంలో వారిని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు పంపుతున్న కుమారులకు 'తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం గుణపాఠంగా నిలుస్తుందని పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సభా మందిరంలో 'తిరగబడ్డ మమకారం' సందేశాత్మక లఘుచిత్రాన్ని లాంఛనంగా విడుదల చేశారు. అనంతరం కళాశాల విద్యార్థులకు చిత్రాన్ని తెరపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆలనాపాలనతో చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. వృద్ధుల సంరక్షణకు చట్టపరమైన రక్షణ కూడా ఉందని తెలిపారు. యువతలో తల్లిదండ్రుల పట్ల బాధ్యతను గుర్తుచేసే విధంగా మంచి సందేశంతో లఘుచిత్రాన్ని రూపొందించారని చిత్ర బృందాన్ని అభినందించారు. సమాజానికి సందేశాన్ని అందించేందుకు తగిన వయస్సులో ఉన్న యువతను కలిగి ఉన్న కళాశాలలో ఈ లఘుచిత్రాన్ని ప్రదర్శించడం సముచితంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే మరిన్ని సందేశాత్మక లఘుచిత్రాలను రూపొందించాలని సూచించారు. లఘుచిత్రంలో మేజిక్ రాజా, రజిత నటన ఆకట్టుకుందని అధికారులు ప్రశంసించారు. ముఖ్యంగా మేజిక్ రాజా తన నటనతో ప్రతిభను చాటుకున్నారని పేర్కొన్నారు. నటీనటులు పోతు శంకరయ్య, సతీష్, శ్రీలత, సిరిపురం శ్రీనివాస్, అంజిబాబులను అభినందించారు. దర్శకుడు చంద్రపాల్ కేవలం సెల్‌ఫోన్‌తోనే చిత్రీకరణ, డబ్బింగ్, నేపథ్య సంగీతం తదితర పనులను నిర్వహించడం అభినందనీయమన్నారు. దర్శకుడు చంద్రపాల్ మాట్లాడుతూ సమాజహితానికి ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలను నిర్మించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ప్రయత్నానికి సహకరిస్తున్న కళాకారులు, ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల బాధ్యులు అతిథులను మర్యాదపూర్వకంగా సత్కరించారు. సీనియర్ పాత్రికేయులు దయానంద్ గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్మూరి అమరేందర్‌రావు, ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ దామెర, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సాంబశివరావు, అధ్యాపకులు సుబ్బారావు, ఉషారాణి, ఇప్టా జాతీయ సమితి సభ్యులు కవ్వంపల్లి స్వామి, కన్నం లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, పందిళ్ల శ్యామ్‌సుందర్, కె.ఎస్.వాసు, రాంశంకర్, జబ్బర్‌ఖాన్, సినీ దర్శక, నిర్మాత నరేష్‌వర్మ, మొగరం గట్టయ్య, మేజిక్ హరి, శశి, వేముల అశోక్, జక్కని శ్రీలత, దామెర రాజేష్, కాసిపాక రాజమౌళి, వాసు, బీర్క లక్ష్మణ్, దేవా తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 3:**





జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను, రాఘవపూర్ గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి భవనాన్ని, పెద్దపల్లి బస్ డిపో నిర్మాణ పనులను, కూనారం రైల్వే ఫైవంతెన నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. రాఘవపూర్ గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, భవన నిర్మాణ పనులు పూర్తయినందున ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. భవనానికి సంబంధించిన రాకపోకల మార్గాన్ని పరిశీలించి, అవసరమైన మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పెద్దపల్లి బస్ డిపో నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రయాణికులు, సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బస్ డిపో నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కూనారం రైల్వే ఫైవంతెన నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫైవంతెన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ తీగలు, స్తంభాల మార్పిడి పనులను త్వరితగతిన పూర్తి చేసి తదుపరి నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో పెద్దపల్లి ఆర్డీఓ బి. గంగయ్య, డీఈ రమణారెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, ఈఈ పీఆర్ శంకరయ్య, గోదావరిఖని డిపో మేనేజర్ కవిత, రైల్వే జేఈ జానకిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ భవ్ సింగ్, తహసీల్దార్ రాజయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాలతో చెక్కు అందించిన కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్

**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 3:**



రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 1వ డివిజన్ పీకే రామయ్య కాలనీకి చెందిన డాంగి సంతోష్ ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడి వైద్య చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆయనకు ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. మంజూరైన సహాయ నిధి చెక్కును శనివారం 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ బాధితుడు డాంగి సంతోష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంతోష్ కుటుంబానికి ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సహాయం కొంత ఊరటనిస్తుందని తెలిపారు. పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి సహాయ నిధి చెక్కు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు, చెక్కును స్వయంగా అందజేసిన కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్‌కు డాంగి సంతోష్, ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పొడిగింపు

## బీసీ, ఈబీసీ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 3:**



మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం 2026 ఆగస్టు, సెప్టెంబర్ దశకు సంబంధించిన దరఖాస్తుల సమర్పణ గడువును అక్టోబర్ 15, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ తెలిపారు. సెప్టెంబర్ 30తో ముగియాల్సిన దరఖాస్తుల గడువును మరో 15 రోజుల పాటు పొడిగించినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యలో మాస్టర్స్, డాక్టరేట్ స్థాయిలో చదువుకోవాలనుకునే అర్హత కలిగిన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవీందర్ సూచించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరులు కలిపి రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థి వయస్సు 35 సంవత్సరాలు మించకూడదని, డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా విదేశీ విద్యకు సంబంధించిన ప్రవేశ అర్హత పరీక్షల్లో నిర్దేశించిన కనీస మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. జీఆర్‌ఈలో 260 మార్కులు లేదా జీమ్యాట్‌లో 500 మార్కులు సాధించి ఉండాలని, వీటిలో ఏదో ఒక పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. టోఫెల్‌లో 60 మార్కులు, ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 బ్యాండ్ లేదా పీటీఈలో 50 మార్కులు సాధించి ఉండాలని, వీటిలో ఏదో ఒక పరీక్షలో అర్హత పొందాలని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ సూచించారు. నమోదు, దరఖాస్తు విధానం, అర్హతలు, ఇతర పూర్తి వివరాల కోసం తెలంగాణ ఈ-పాస్ అధికారిక అంతర్జాల చిరునామాను సందర్శించాలని తెలిపారు.

# ప్రతి ఇంటికీ ఉచిత రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్-భవిష్యత్తుకు బలమైన అడుగు




దేశంలో విద్యుత్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో విద్యుత్ వినియోగం మరింత అధికమవుతోంది. అదే సమయంలో బొగ్గు, చమురు, సహజవాయువు వంటి సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటం వల్ల పర్యావరణ కాలుష్యం, కార్బన్ ఉద్గారాలు, వాతావరణ మార్పులు వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సౌర విద్యుత్ దేశానికి దీర్ఘకాలిక పరిష్కారంగా నిలుస్తోంది. అందువల్ల ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వం ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భారతదేశానికి సూర్యకాంతి సమృద్ధిగా లభించే భౌగోళిక పరిస్థితి ఉంది. సంవత్సరంలో ఎక్కువ రోజులు సూర్యరశ్మి అందుబాటులో ఉండటం మనకు ఒక సహజ వనరుగా మారింది. ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం ద్వారా కుటుంబాలు తమ విద్యుత్ అవసరాల్లో కొంత భాగాన్ని లేదా చాలా భాగాన్ని స్వయంగా ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల విద్యుత్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా, దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.ప్రస్తుతం మధ్యతరగతి, పేద కుటుంబాలకు సోలార్ ప్యానెళ్ల ప్రారంభ వ్యయం ఒక ప్రధాన అడ్డంకిగా ఉంది. ప్యానెళ్లు, ఇన్వర్టర్, బ్యాటరీ, వైరింగ్, నిర్మాణ సామగ్రి, ఇన్‌స్టాలేషన్ తదితర ఖర్చులు కలిపి వ్యవస్థ ఏర్పాటు చేయడం ప్రతి కుటుంబానికి సాధ్యం కాకపోవచ్చు. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు దీర్ఘకాలిక ప్రయోజనం ఉన్నప్పటికీ ప్రారంభ పెట్టుబడి పెట్టలేని పరిస్థితి ఉంటుంది. అందుకే ప్రభుత్వాలు ఈ వ్యయాన్ని భరించే విధంగా ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి.ప్రతి ఇంటి పైకప్పును ఒక చిన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చే విధానం అమలు చేయవచ్చు. అర్హత ఉన్న కుటుంబాల ఇళ్లపై ప్రభుత్వం లేదా ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలు నాణ్యమైన సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలి. నిర్వహణ, మరమ్మతులు, వారంటీ వంటి అంశాలకు కూడా స్పష్టమైన విధానం ఉండాలి. విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న సమయంలో గ్రిడ్‌కు విద్యుత్ అందించే విధంగా నెట్ మీటరింగ్ లేదా అందుబాటులో ఉన్న ఇతర విధానాలను సులభతరం చేయాలి.ఇలాంటి పథకం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యేక ప్రయోజనం ఉంటుంది. నెలవారీ విద్యుత్ బిల్లులో గణనీయమైన ఆదా కలగవచ్చు. ఆ మొత్తాన్ని కుటుంబాలు పిల్లల విద్య, వైద్యం, ఆహారం వంటి అవసరాలకు వినియోగించుకోవచ్చు. అదే సమయంలో విద్యుత్ ధరల పెరుగుదల ప్రభావం కూడా కొంతవరకు తగ్గుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు సోలార్ విద్యుత్ అందుబాటులోకి రావడం వల్ల విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంటుంది.సౌర విద్యుత్ విస్తరణ పర్యావరణ పరిరక్షణకు కూడా ఉపయోగపడుతుంది. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడటం తగ్గితే వాయు కాలుష్యం, కార్బన్ ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలకు తోడ్పడుతుంది. పట్టణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పైకప్పులను వినియోగించడం ద్వారా అదనపు భూమిని పెద్ద ఎత్తున వినియోగించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.అయితే ఉచిత సోలార్ పథకం పేరుతో నాసిరకం పరికరాలు సరఫరా కాకుండా ప్రభుత్వం కఠినమైన నాణ్యత ప్రమాణాలను అమలు చేయాలి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత ఉండాలి. విద్యుత్ శాఖలు, స్థానిక సంస్థలు, డిస్కంలు, బ్యాంకులు, సోలార్ సంస్థల మధ్య సమన్వయం అవసరం. పథకం అమలు తర్వాత సేవలు అందించే బాధ్యతను కూడా స్పష్టంగా నిర్ణయించాలి.భవిష్యత్తులో ప్రతి ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్ ఉండేలా జాతీయ స్థాయిలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవచ్చు. పేద మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత సోలార్ విద్యుత్ అమలు పరిచేందుకు ప్రభుత్వం పరిశీలించవచ్చు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, కమ్యూనిటీ భవనాలపై కూడా సోలార్ వ్యవస్థలను తప్పనిసరిగా ప్రోత్సహించాలి.విద్యుత్ స్వావలంబన కేవలం ఒక కుటుంబ ప్రయోజనం కాదు; అది దేశ ఆర్థిక, పర్యావరణ భద్రతకు సంబంధించిన అంశం. ప్రతి ఇంటి పైకప్పుపై సూర్యుడి శక్తిని విద్యుత్‌గా మార్చగలిగితే లక్షలాది కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. విద్యుత్ ఉత్పత్తి రంగంలో కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా బలమైన పునాది ఏర్పడుతుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర పథకాన్ని రూపొందించాలి. ఉచితంగా సాధ్యమైనంత సోలార్ విద్యుత్ వ్యవస్థలను అందించడం ద్వారా ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించడంతో పాటు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, స్థిరమైన విద్యుత్ వ్యవస్థను అందించే దిశగా దేశం ముందుకు సాగాలి.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752, హైదరాబాద్

RNI NO:TGTEL/26/A0383
దైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# యాసంగిలో పప్పుధాన్యాల సాగే మేలు

**ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి.**

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్):**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే పప్పుధాన్యాల పంటలను సాగు చేయాలని ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డోర్నకల్ మండలం చిలుకోడు రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగించిన ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. జలాశయాల్లో నీటి మట్టాలు




తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లు ఎండిపోతుండటంతో రైతులు యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. ఒక ఎకరం వరి పంటకు ఉపయోగించే నీటితో రెండు నుంచి మూడు ఎకరాల్లో పప్పుధాన్యాల పంటలను సమర్థవంతంగా పండించవచ్చని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ జారీ చేసే సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రతి రైతు విధిగా 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' చేయించుకోవాలని సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. నమోదు చేసుకోని పక్షంలో పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోవడం సాధ్యపడదని, అలాగే పీఎం కిసాన్, రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, యూరియా సరఫరా, వ్యవసాయ పరికరాల వంటి ప్రభుత్వ లబ్ధిని కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కావున రైతులు తక్షణమే తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులను (ఏఈఓ) సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి అనిల్, సెరికల్చర్ అధికారి సురేష్, ఏఈఓలు మరియు స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు వాయిదా వేయడం సరికాదు

- **టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్.**

**కురవి, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**

అధ్యయన కమిటీల పేరుతో సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దును వాయిదా వేయడం ఎంతమాత్రం సరికాదని, ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల శాఖ అధ్యక్షుడు గుండ్ల విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల



సమస్యల సేకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమేనని విమర్శించారు. అలాగే వేతన సవరణ కమిటీ (పీఆర్సీ)ని నియమించి మూడు సంవత్సరాలు గడిచినా, ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో 'నివేదిక త్వరలోనే సమర్పిస్తాం' అని చెప్పి ప్రభుత్వం మాట దాటవేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, పీఆర్సీ నివేదికను ఆమోదించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, జిల్లా బాధ్యులు బొల్లం శ్రీనివాస్, గోనె కార్తిక్, ముస్తఫా, పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కురవి ఎస్సీ వసతి గృహం నూతన భవనంలోకి మార్పు

**ఎమ్మెల్యే రామచంద్రనాయక్ చిత్రపటానికి దళిత సంఘాల పాలాభిషేకం**

**కురవి, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**

మండల కేంద్రంలోని పాత ఎస్సీ బాలికల వసతి గృహాన్ని నూతనంగా నిర్మించిన భవనంలోకి తరలించేందుకు ప్రత్యేక చొరవ చూపిన డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్‌కు దళిత సంఘాల నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కురవి మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పాత వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులు, భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని నూతన భవనంలోకి తరలించాలని దళిత నాయకులు చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. విద్యార్థుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నూతన భవనంలోకి హాస్టల్‌ను మార్చేందుకు ఆయన చూపిన కృషి అభినందనీయమని నాయకులు కొనియాడారు. నూతన భవనంలో విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు సురక్షితమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, దళితరత్న దైద భద్రయ్య (కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు), సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత కన్నెర మల్లయ్య, మాజీ వార్డు సభ్యులు ఇరుగు వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, హమాలీ సంఘం అధ్యక్షుడు పిలిమర్తి రమణయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడ శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దైద నితిన్, చింటూ, సందీప్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



## కురవిలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**5 లీటర్ల సారా స్వాధీనం : కురవి సెకండ్ ఎస్సై విజయ్ కుమార్**

**కురవి, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**



మండల పరిధిలోని లింగ్యా తండా (బలపాల)లో అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు కురవి ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో కురవి ఎస్సై వి. జయకుమార్, సిబ్బంది పిసి 1787, పిసి 3717, దేవి (డబ్ల్యూపీసీ 1735)లతో కలిసి లింగ్యా తండాలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన మాలోతు జగ్గు (55, తండ్రి: అమ్రు) అక్రమంగా నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి సుమారు రూ. 2,000 విలువైన 5 లీటర్ల కాచిన నాటు సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిపై క్రైమ్ నంబర్ 200/2026, తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ (టిఎస్పిఎ) యు/ఎస్ 7(ఎ) ఆర్/డబ్ల్యూ 8(ఎ) కింద కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై జయకుమార్ వెల్లడించారు. అక్రమంగా నాటు సారా కాచినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## మహిళా సాధికారత కేంద్రంచే గొడుగులు పంపిణీ

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**

మహిళా సాధికారత, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారి శిరీష తెలిపారు. జిల్లా సక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు అవసరమైన సహాయంలో భాగంగా గొడుగుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అనంతరం శిరీష మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి ప్రాజెక్టు పరిధిలోని లబ్ధిదారులకు 5 గొడుగుల చొప్పున అందజేస్తున్నామని వివరించారు. మహిళలకు అవసరమైన సంక్షేమ పథకాలు, సహాయక చర్యలను మహిళా సాధికారత కేంద్రం ద్వారా వేగవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకున్న రవినాయక్

**కురవి, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**

కురవి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ నాయకులు గుగులోతు రవినాయక్ పట్టభద్రులతో కలసి ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం దరఖాస్తు (ఫామ్ 18) అందజేశారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. కురవి మండల పరిధిలోని గ్రాడ్యుయేట్లు ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటు హక్కును పొందేందుకు తహసిల్దార్ కార్యాలయంలో నేరుగా ఆఫ్ లైన్ ద్వారా గాని, ఆన్ లైన్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన పట్టభద్రులందరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 2023 కంటే ముందు డిగ్రీ, తత్సమాన డిప్లమా లేదా ఓపెన్ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని గ్రాడ్యుయేట్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు గుగులోతు వెంకటేష్, బానోత్ వాసు తదితరులు పాల్గొని తమ దరఖాస్తులను సమర్పించారు.



# మహబూబాబాద్‌లో కుసుమ విత్తనాల పంపిణీ

- **20 ఎకరాల్లో క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు.**
- **రైతులకు అందజేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కుసుమ (సేఫ్లవర్) విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన



కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ చేతుల మీదుగా రైతులకు ఈ విత్తనాలను అందజేశారు. మొత్తం 20 ఎకరాల విస్తీర్ణంలో క్షేత్ర ప్రదర్శన (ఫీల్డ్ డిమాంస్ట్రేషన్) నిర్వహించేందుకు గాను ఈ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయచంద్ర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్--2026' పథకంలో భాగంగా నూనెగింజల పంటల సాగు, ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా నూనెగింజల సాగు వైపు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ విత్తనాల పంపిణీ చేపట్టిందని, ఈ పథకం ద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డివిజన్ ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఎన్. తిరుపతిరెడ్డి, ఏఈఓలు పున్నమి, వినుషా, ఏవో (టెక్నికల్) బి. రాంజీ, అలాగే స్థానిక రైతులు బావసింగ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు టీ-షర్టులు, విద్యాసామాగ్రి పంపిణీ

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్):**

బయ్యారం మండల పరిధిలోని గోరిమల్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం స్ఫూర్తి రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో టీ-షర్టులు, నోటు పుస్తకాలు మరియు విద్యా సామాగ్రిని ఘనంగా పంపిణీ చేశారు. స్థానిక దాతలు కంటెం శ్రీదేవి, కంటెం నవీన్ చొరవతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్ రెడ్డి విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏటా తమ సొసైటీ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నోటు పుస్తకాలు, టీ-షర్టులు అందించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పాఠశాల హెచ్ఎం ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... పేద విద్యార్థుల చదువుకు తోడ్పాటునందిస్తున్న దాతలు కంటెం శ్రీదేవి-నవీన్ దంపతులతో పాటు, స్ఫూర్తి సొసైటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, వారి సేవా నిరతి వెలకట్టలేనిదని కొనియాడారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణించాలనే లక్ష్యంతోనే తమ సంస్థ పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం బి. సక్రు, బి. రాంజీ, ఎండీ గౌస్ పాషా, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మానవతా శిఖరం గాంధీజీ

**: అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్**

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**



గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలే మానవాళికి శరణ్యమని, ఆయన నిజమైన మానవతా శిఖరమని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ కొనియాడారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో గాంధీ జయంతిని పురస్కరించుకుని 'గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో మనుషులు యాంత్రిక జీవనానికి అలవాటుపడి చిన్నచిన్న సమస్యలకే కృంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌమార దశలో సరైన మార్గనిర్దేశం లేకపోవడం వల్లే యువత దారితప్పి హత్యలు, ఆత్మహత్యలు, హింస వైపు మళ్లుతున్నారని విశ్లేషించారు. సమాజంలో పెరుగుతున్న అరాచకాలు, మతకలహాలు, వర్గపోరాటాలను అరికట్టడానికి మనం మళ్లీ మన మూలాలైన పురాతన సంప్రదాయాలు, ఆధ్యాత్మికత వైపు చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ... గత 20 ఏళ్లుగా సెప్టెంబర్ 2 నుండి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా గాంధీజీ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గాంధీజీ ఆలోచనలను విద్యార్థులకు పరిచయం చేయడమే లక్ష్యంగా 'ప్రపంచ శాంతి - గాంధీ మార్గం' అనే అంశంపై ప్రతి ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మోత్కూరు వెంకటేశ్వర్లు, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ వంగ సురేష్, ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి వేంగంటి శుభతో పాటు విజేతలైన విద్యార్థులు సుప్రియ, అక్షర, యశ్వంత్, వరుణ్ చారి, మదిహ, చందు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలాధారం

**స్పెషల్ క్యాంపెయిన్--6లో జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు**

**జనం వాయిస్, మందమర్రి, అక్టోబర్ 3:**





పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ నిత్యకృత్యంగా మార్చుకోవాలని మందమర్రి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన "స్పెషల్ క్యాంపెయిన్--6 -- స్వచ్ఛ భారత్" కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛ భారతాన్ని సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పరిసరాల అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇది వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుందని తెలిపారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి ఇళ్లు, పరిసరాలు, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యాలయాలు, గనులు, పని ప్రదేశాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకుని, స్వచ్ఛమైన వాతావరణంతో పాటు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి కాతం వెంకట్‌రెడ్డి, సీనియర్ పీవో ఎం. కార్తీక్, సీ.వీ. రమణ, ఫిట్ సెక్రటరీ గీతికతో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 9, 11 తరగతుల ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**



దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027--28 విద్యా సంవత్సరానికి గాను 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును పెంచినట్లు మామూనూర్ (వరంగల్) జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ టి. రమేష్ తెలిపారు. "లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్--2027" (జెఎన్వి లిస్ట్ - 2027) ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును అక్టోబర్ 15, 2026 వరకు పొడిగించినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవోదయ విద్యాలయాల్లో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఈ ఖాళీల భర్తీ చేపడుతున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. సీబీఎస్ఈ (సీబీస్) అనుబంధం, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యప్రణాళికతో 6 నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత నివాస విద్యను అందించడం నవోదయ పాఠశాలల ప్రత్యేకత అని వివరించారు.

**అర్హతలు:**

9వ తరగతి: విద్యార్థులు 01-05-2012 నుండి 31-07-2014 మధ్య జన్మించి ఉండాలి. ప్రస్తుతం (2026--27) సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతుండాలి. 11వ తరగతి: విద్యార్థులు 01-06-2010 నుండి 31-07-2012 మధ్య జన్మించి ఉండాలి. ప్రస్తుతం సంబంధిత జిల్లాలో 10వ తరగతి చదువుతూ ఉండాలి.

**ముఖ్యమైన వివరాలు:**

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 15 అక్టోబర్ 2026, ఎంపిక పరీక్ష తేదీ: 10 ఏప్రిల్ 2027, రిజర్వేషన్లు: మొత్తం సీట్లలో 75 శాతం గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం పట్టణ విద్యార్థులకు కేటాయిస్తారు. నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు (పిహెచ్) మరియు బాలికలకు ప్రత్యేక రిజర్వేషన్లు వర్తిస్తాయి. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# యువతకు ఉపాధి బాట.. 9న జాబ్ మేళా..

**జనం వాయిస్,శాయంపేట,అక్టోబరు 3:**

ఈ నెల 9న భూపాలపల్లిలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న జాబ్ మేళాకు మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని తహసీల్దార్ ఆర్. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఎంపీడీవో ఫణిచంద్ర అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు జాబ్ మేళా వివరాలను తెలియజేసి, ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి యువత హాజరయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై జక్కుల పరమేష్, ఏపీఎం ఎర్రబెల్లి వేణుగోపాలరావు, ఎంపీవో రంజిత్‌కుమార్, ఏపీవో అనిత, ఏవో ప్రియదర్శిని, ఐకేపీ సీసీలు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, మంజుల, అనుష, వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# శాయంపేట ఎంజెపి గురుకులంలో బతుకమ్మ సందడి..

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 3:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా శాయంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల (బాలుర)పాఠశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు టి. రేవతి తెలిపారు. సుమారు 150 మంది విద్యార్థుల తల్లులు, మహిళా ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన మహిళలు పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు వేడుకలు నిర్వహించినట్లు రేవతి వెల్లడించారు. మహిళల ఐక్యత, ప్రకృతి ప్రేమకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.



# హిందూ సంఘాలు - పోలీసుల మధ్య తీవ్ర ఉద్రిక్తత

**అక్టోబర్ 3 జనం వాయిస్ హైదరాబాద్:**



దిల్‌సుఖ్‌నగర్ సంతోషిమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై అనుచితంగా ప్రవర్తించిన ఘటన నేపథ్యంలో హిందూ సంఘాలు, పోలీసుల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనపై పోలీసులు సరైన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదంటూ హిందూ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆలయ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల ప్రతినిధులు పోలీసులను డిమాండ్ చేశారు. మరోవైపు పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు.

# ప్రాథమిక విద్యకు "తొలిమెట్టు" పునాది

## ఎఫ్ఎల్ఎన్ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, అక్టోబర్ 3 (జనం వాయిస్) :**

పాఠశాల స్థాయిలో ప్రతీ విద్యార్థికి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఫౌండేషనల్ లీటరసీ అండ్ నూమట?రేసీ- ఎఫ్ఎల్ఎన్) పై బలమైన పునాది వేసేందుకు "తొలిమెట్టు" కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. 1 నుండి 5వ తరగతి విద్యార్థుల్లో ధారాళంగా చదివే, రాసే నైపుణ్యాలతో పాటు ప్రాథమిక గణిత భావనలపై స్పష్టత తేడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. 5వ తరగతి పూర్తయ్యే సమయానికి ప్రతీ విద్యార్థి స్వతంత్రంగా చదవడం, రాయడం, ప్రాథమిక కూడికలు, తీసివేతలను సులభంగా చేసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వర్క్‌బుక్స్, బోధనా అభ్యసన సామాగ్రి (టిఎల్ఎం), రంగురంగుల చిత్రాలు, కథలు, ఆటపాటల ద్వారా సృజనాత్మక పద్ధతిలో బోధన అందించాలని సూచించారు.



**నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం:**

విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తోడ్పాటు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. 'బేస్ లైన్' టెస్ట్‌లో నమోదైన విద్యార్థుల ప్రగతిని 'మిడ్ లైన్' టెస్ట్ నాటికి గణనీయంగా మెరుగుపరిచి, జిల్లా ర్యాంకింగ్‌ను పెంచేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో ఏవైనా మౌలిక వసతుల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

**హాజరు శాతంతో పాటు ఆధునిక బోధన:**

జిల్లాలోని అన్ని ప్రైమరీ, హైస్కూళ్ల విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయడంతో పాటు హెల్త్, న్యూట్రిషన్, శానిటేషన్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని 100% నమోదు చేసేలా ప్రోగ్రామ్ ఆఫీసర్లు నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విధానాల ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు విద్యా యజ్ఞంలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, హౌసింగ్ పీడీ పురుషోత్తం, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ నితీష్, ఇంచార్జి జిల్లా విద్యాధికారి శ్రీరాములు, కోఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, సురేష్, గాయత్రి, సంతోష్, ఎఫ్ఎఓ శంకర్, సైన్స్ ఆఫీసర్లు అప్పారావు, సతీష్, వివిధ మండలాల ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

# భూవివాదంలో ఇరువర్గాల ఆరోపణలు

- భూమిని స్వాధీనం చేసుకునేందుకే ఒత్తిడి: పోలేపల్లి శ్రీనివాసరెడ్డి.
- పూర్వీకుల భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేశారని ఆలేటి సతీష్ ఆరోపణ.





**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 3:**

భూవివాదం వ్యవహారం ఇరువర్గాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మరింత ముదిరింది. తన భూమిని స్వాధీనం చేసుకునేందుకే పిన్నింటి కిషన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారని పోలేపల్లి శ్రీనివాసరెడ్డి ఆరోపించగా.. బయానా కాగితాలను అడ్డుపెట్టుకుని నకిలీ పత్రాలతో తమ పూర్వీకుల భూమిని ఆక్రమించుకున్నారని ఆలేటి సతీష్ ఆరోపించారు.

**సర్వే నంబరు 111లో 2.08 ఎకరాలు కొనుగోలు..**

2007లో కొత్తగట్టు సింగారంకు చెందిన ఆలేటి వెంకటమ్మ వద్ద సర్వే నంబరు 111లోని 2 ఎకరాల 8 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందులో సదానందం, సాంబయ్యల పేర్లపై ఉన్న 15 గుంటల భూమిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. మిగిలిన భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలోపే వెంకటమ్మ మృతి చెందడం, క్రరు బుచ్చిరెడ్డికి పక్షవాతం రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు.

ఈ పరిస్థితిని అదునుగా తీసుకున్న క్రరు బుచ్చిరెడ్డి అల్లుడు పిన్నింటి కిషన్‌రెడ్డి మిగిలిన భూమిని తన పేరుతో, తన భార్య పేరుతో ఎక్కించుకున్నారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అనంతరం గత కొంతకాలంగా తాను హక్కు కోసం పోరాడి, భూమిని తన పేరుపై పట్టా చేయించుకునే సమయంలో అసలు సర్వే నంబరు 111కు బదులుగా 113గా నమోదైందని తెలిపారు.

**113 మూసివేశా.. 111 భూమి పట్టా చేయాలి..**



సర్వే నంబరు 111కు బదులుగా 113లో పట్టా నమోదైన విషయాన్ని పరిష్కారానికి అధికారులను, న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. 113లోని భూమిని కిషన్‌రెడ్డి పేరుపై ఉంచి, సర్వే నంబరు 111లోని భూమిని తన పేరుపై పట్టా చేయించేలా అవగాహనకు వచ్చారని శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందుకు తాను అంగీకరించి 113 సర్వే నంబరును క్లోజ్ చేసుకున్నానన్నారు. ఇప్పుడు 111లో ఉన్న భూమిని తన పేరుపై పట్టా చేయాలని అధికారులను కోరుతున్నట్లు చెప్పారు.

అయితే కిషన్‌రెడ్డి అమెరికాలో ఉన్నాడని, ఆయన రావాలని చెప్పి అధికారులు సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.తన వద్ద పదనపు భూమి లేదని స్పష్టం చేశారు.తనను, తన కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య ఆరోగ్యం కూడా బాగోలేదని, భూమి వ్యవహారంలో నెలకొన్న పరిణామాలతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని రికార్డులను పరిశీలించి 111 సర్వే నంబరులోని భూమిని తన పేరుపై పట్టా చేయాలని కోరారు.

**భూమిపై కన్నేయడమే కారణమా?**

తనకు చట్టబద్ధంగా చెందిన భూమిపై హక్కు సాధించుకునేందుకు ప్రయత్నిస్తుంటే కిషన్‌రెడ్డి వైపు నుంచి ఒత్తిడి వస్తోందని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తన భూమికి సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఆధారాలన్నీ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలని, అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ వివాదానికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా వ్యక్తిగత భూహక్కులకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు.

**ఆలయ దారికి భూమి ఇచ్చా..**

గ్రామస్థులు, యువకుల విజ్ఞప్తి మేరకు కనకదుర్గమ్మ ఆలయానికి దారి ఏర్పాటుకు తన భూమిని స్వచ్ఛందంగా ఇచ్చానని శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిని అక్రమంగా చిత్రీకరించడం సరికాదన్నారు. ఇప్పటికే రెండు ఎకరాల భూమి వివాదంలోకి వెళ్లిందని, మరో భూమిని కలిపి నాలుగు ఎకరాలు స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

**పూర్వీకుల భూమి కాపాడాలంటూ సతీష్..**

పిన్నింటి కిషన్‌రెడ్డి బయానా కాగితాలను చూపించి మిగిలిన నగదు చెల్లించకుండా నకిలీ పత్రాలతో తమ పూర్వీకుల భూమిని ఆక్రమించుకున్నారని ఆలేటి సతీష్ ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని ప్రశ్నించిన కనుపరుతి సుదర్శన్‌ను గతంలో హత్య చేశారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి నకిలీ పట్టాలను రద్దు చేసి భూమిని తమకు అప్పగించాలని కోరారు. కనకదుర్గమ్మ ఆలయానికి చెందిన నాలుగు గుంటల భూమిని సైతం ఆక్రమించి రైతుబంధు పొందుతున్నారని ఆరోపించారు. న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయించి భూమి దక్కే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని సతీష్ తెలిపారు.

# అక్టోబర్ 5న పాలకుర్తి లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ

**అక్టోబర్ 3 జనం వాయిస్ పాలకుర్తి:**



మండలం పాలకుర్తి కేంద్రంలో సేవ్ డెమోక్రసీ వీక్ ఓటు బచావో డిష్ బచావో కార్యక్రమాల్లో భాగంగా టీపీసీసీ పిలుపు మేరకు, పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మరియు డిసిసి ప్రెసిడెంట్ ఆదేశానుసారం పాలకుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు పోగు శ్రీనివాస్ మాచర్ల సారయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండియా కూటమి, సీపీఎం, కాంగ్రెస్ తదితర భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొని, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 5వ తేదీన పాలకుర్తి కేంద్రంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ర్యాలీని విజయవంతం చేసేందుకు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి మాజీ దేవస్థానం చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి ఎక్స్ సర్పంచ్ వీరంనేని యాకాంతరావు సోమసత్యం ఏదునూరి మదార్ చిట్యాల సోమన్న ఆదినారాయణ మాదాసు హరీష్ కమ్మగాని నాగయ్య పన్నీరు వెంకన్న రవి సర్పంచ్ పాటు వివిధ హోదాల్లో ఉన్న ఇండియా కూటమి, కాంగ్రెస్ మరియు భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్‌లో భాగంగా స్పెషల్ డ్రైవ్

## పాలకుర్తిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

**పాలకుర్తి అక్టోబర్ 3 జనం వాయిస్:**



పాలకుర్తి ఎంపీడీవో వేదవతి సూచనల మేరకు పాలకుర్తి మండలంలో స్వచ్ఛభారత్ మన చుట్టుపక్కల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ ఆధ్వర్యంలో చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మొదటి రోజు పాఠశాలల పరిసరాలను ప్రత్యేకంగా శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం పిచ్చి మొక్కలు వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించి పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని స్వచ్ఛత అనేది ఒక్కరోజు కార్యక్రమం కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో పాలకుర్తి ఎంఈఓ పోతుగంటి నరసయ్య ఎంపీపీ ఎస్ హెచ్ఎం చిదురాల శ్రీనివాస్ వార్డు సభ్యులు మామిండ్ల కవితా శోభన్ బాబు కమ్మగాని శ్రీకాంత్ గౌడ్ పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది గాదపాక పరంజ్యోతి అంజద్ ఖాన్ పాఠశాల సిబ్బంది సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాబోయే రోజుల్లో కూడా మండలంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPAL-LI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com